జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com




# అచ్చెన్న ఇలాఖాలో.. రైతులకు అన్యాయం

✳ రబీలో సోంపేట మండలంలో నష్టపోయిన పంటలు ✳ నాలుగు నెలలు కావస్తున్నా రైతులకు అందని పరిహారం ✳ ఖరీఫ్ వచ్చినా తప్పని నిరీక్షణ ✳ అమలు కానీ ఎమ్మెల్యే అశోక్ హామీ ✳ వ్యవసాయ మంత్రి ఇలాకాలో రైతన్నకు తప్పని తిప్పలు



సోంపేట, జులై 5 (వార్త): వ్యవసాయ శాఖ మంత్రి ఇలాకాలోనే రైతన్నలకు తిప్పలు తప్పడం లేదు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమంటూ ఎల్లవేళలా వ్యవసాయ రంగం అభివృద్ధికి తమ ప్రభుత్వం అండగా ఉంటుందని హామీలు గుప్పిస్తున్న ప్రభుత్వ నేతలు సోంపేట మండలంలో పలు రకాలైన రబీ పంటలకు తీవ్ర నష్టం వాటిల్లి సర్వనాశనమైనప్ప టికీ బాధిత రైతాంగాన్ని ఆదుకోవడంలో నేతలు చూపుతున్న నిర్లక్ష్యం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సోంపేట మండలం జింకిభద్ర, బెంకిలి, పలాసపురం గ్రామాల్లో ఈ ఏడాది రబీలో సుమారు 500 ఎకరాల్లో సాగుచేసిన టమాటా పంట, సుమారు 200 ఎకరాల్లో సాగుచేసిన కట్టి జనుము, మరో 150 ఎకరాల్లో సాగుచేసిన మినుము, పెసర తదితర పంటలు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో కురిసిన వడగండ్ల వానకు చిత్తయ్యాయి. భారీగా పెట్టుబడులు పెట్టి పంటల ద్వారా చేతికి కాస్తో కూస్తో ఆదాయం అందుతుందన్న దశలో ఆకస్మిక వర్షాలతో రైతులందరూ తీవ్రంగా నష్టపోయారు. ఈ గ్రామాల్లో రైతులను ఆదుకునే ఇటువంటి పంటలను ప్రతి ఏటా వేసవికాలంలో సాగు చేయడం ఆనవాయితీ. పంట చేతికి రాకుండా కళ్లేదుటే వర్షాలకు పూర్తిగా పాడైపోయినపంటలు విషయంలో రైతన్నల పడిన ఆవేదన అంతా అంతా కాదు.



### అమలు కానీ అశోక్ హామీ..

అటువంటి పరిస్థితుల్లో పంట పొలాలను పరిశీలన చేసి తానున్నానంటూ, ప్రభుత్వంతో మాట్లాడి పరిహారం ఇప్పిస్తానంటూ ఎమ్మెల్యే అశోక్ ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరకపోవడం పట్ల బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పటికే ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది సర్వే చేపట్టి రైతు వారీగా జరిగిన నష్టాన్ని నమోదు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదించారు.

### ఖరీఫ్ వచ్చినా ఎదురుచూపులే..

ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో రైతులు అదే పొలాల్లో వరి సాగుకు సమయతమయ్యారు. ఇప్పటికే అనేక మంది రైతులు విత్తనాలు చల్లుకున్నారు. చాలామంది రైతులు ఎద సాగుకు సిద్ధమయ్యారు. ఇదంతా పెద్ద పెట్టుబడితో కూడిన పరిస్థితి. ఇటువంటి సందర్భంలో రబీ పంటల ద్వారా కోల్పోయిన నష్టాన్ని ప్రభుత్వం పూడ్చినట్లయితే ఖరీఫ్ సాగుకు రైతులు ఉత్సాహంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది. ఇవేమీ పట్టించుకోని ప్రభుత్వం నాలుగు నెలలు కావచ్చిన రైతుల పట్ల కనీసం కనికరం చూపకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఎంజె పూలే రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీరావు 'వార్త' ప్రతినిధి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పట్ల ఇలాంటి నిర్లక్ష్యం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రైతుకు వ్యవసాయంలో నష్టం జరిగినప్పుడు ఎంతో కొంత మొత్తం పరిహారంగా అందిస్తే తదుపరి వచ్చే పంట విషయంలో రైతులు ఉత్సాహంగా సాగు చేసుకుంటారన్నారు.



### కన్నెత్తి చూడని వ్యవసాయ మంత్రి...

సోంపేట మండలంలో వడగండ్ల వానకు పంటలు నష్టపోయిన వందలాది మంది రైతులకు కనీసం పరామర్శకు కూడా రాలేని ఇదే జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీరుపట్ల రైతాంగం తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. కనీసం తన సొంత జిల్లాలో పంటకు ఇంత నష్టం వాటిల్లిందన్న కనీస ఆలోచన కూడా మంత్రికి లేకపోవడం ఈ జిల్లా రైతుల దురదృష్టమని వాపోతున్నారు. జిల్లాలోనే వ్యవసాయ మంత్రి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి ఉన్నప్పటికీ ఇక్కడ జరిగిన నష్టం విషయంలో బాధిత రైతులకు పరిహారం ఇప్పించడంలో ఎమ్మెల్యే అశోక్ విఫలమవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు.



## డీపీఆర్‌వోగా జానకమ్మ

శ్రీకాకుళం, జులై 5 (వార్త): డీపీఆర్వోగా ఎస్.జానకమ్మ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా సమాచార పౌర సంబంధాల కార్యాలయంలో డివిజనల్ పీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఆమెకు డీపీఆర్వోగా పదోన్నతి లభించడంతో శ్రీకాకుళం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.చెన్నకేశవరావు సమక్షంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సహాయ పౌర సంబంధాల అధికారి (ఏపీఆర్వో)గా, డివిజనల్ పీఆర్వోగా వివిధ హోదాల్లో సుదీర్ఘ కాలం సేవలందించారు. ఉత్తరాంధ్ర జిల్లాలపై పూర్తి అవగాహన ఉన్న జానకమ్మ శ్రీకాకుళం జిల్లా డీపీఆర్వోగా బాధ్యతలు స్వీకరించడం పట్ల కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.



# నేడు వంశధార నీరు విడుదల

✳ సర్వం సిద్ధం చేసిన వంశధార అధికారులు ✳ శివారుకు సాగునీరు అందేలా చర్యలు: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం/హిరమండలం, జులై 5 (వార్త): జిల్లా రైతాంగానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీపి కబురు అందించారు. ఖరీఫ్ సాగు అవసరాల నిమిత్తం సోమవారం ఉదయం వంశధార ప్రధాన కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేసేందుకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఆదివారం ఉదయం ఈ మేరకు మంత్రి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో ఫోన్లో మాట్లాడారు. సాగునీటి విడుదలపై తగు సూచనలు చేశారు. మంత్రి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమానికి ముహూర్తం ఖరారైంది. వంశధార ప్రాజెక్టు కమిటీ చైర్మన్ అరవల రవీంద్ర, ఇరిగేషన్ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయం చేసుకుంటూ.. సోమవారం నీటిని విడుదల చేయనున్నారు. కేవలం పైప్రాంతాలకే కాకుండా జిల్లాలోని చివరి (శివారు) ఆయకట్టు భూములకు సైతం సక్రమంగా, సమృద్ధిగా నీరందించడమే లక్ష్యంగా నీటి వృధాను అరికడుతూ ప్రతీ ఎకరానికి సాగునీరు చేర్చేలా పక్కా ప్రణాళికతో అధికారులు ముందుకు సాగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారులకు వచ్చిన నాటి నుంచి వంశధార కాలువ ద్వారా సుదూరంలో ఉన్న శివారు కాలువలైన పలాస వరకు నీటిని అందించే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఈసారి కూడా ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేరుస్తామని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గొట్టాబ్యారేజికి అనుసంధానమైన ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఖరీఫ్ సీజన్‌కు గాను సాగునీటి విడుదల చేయనున్నట్లు గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయ విభాగం ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. బ్యారేజి గేట్లు మూసివేసి నీటి నిల్వలు చేపట్టామన్నారు. ప్రస్తుతం గొట్టాబ్యారేజిలో 0.31 టిఎంసీ నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ మేరకు గొట్టాబ్యారేజి కంట్రోల్ కార్యాలయానికి సంబంధించిన ఉద్యోగస్తులు ఎడమ ప్రధాన కాలువకు సంబంధించిన గేట్లను పరిశీలించారు.



# 'టాటా మోటార్స్'లో ఉద్యోగావకాశాలు


శ్రీకాకుళం, జులై5 (వార్త): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'కౌశలం' ప్రోగ్రాంలో భాగంగా నిరుద్యోగ యువతకు టాటా మోటార్స్ కంపెనీలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. పూణేలో పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులను ఈ నెల 9, 10 తేదీల్లో విజయనగరం జిల్లాలో నిర్వహించే ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేయనున్నారు. ఈ డ్రైవ్‌లో రెండేళ్ల ఐటీఐ (మోటార్ మెకానిక్ వెహికల్, ఫిట్టర్, టర్నర్, మెషినిస్ట్, ఇన్స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్, టెక్నీషియన్ మెకాట్రానిక్స్, మెయింటెనెన్స్ మెకానిక్, ఆర్ఏసీ, టీడీఎం) లేదా ఇంటర్ (ఆర్ట్స్, కామర్స్, సైన్స్) ఉత్తీర్ణతతో పాటు 18 నుండి 23 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులు.ఈ డ్రైవ్ కోసం శ్రీకాకుళం జిల్లా నుంచి ఇప్పటికే 2,811 మంది అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయగా, వీరికి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డుల ద్వారా ఫోన్లలో సమాచారం అందిస్తున్నారు. జాబితాలో పేరు లేని వారు కూడా అర్హతలు ఉంటే.. ఈ నెల 9వ తేదీ లోపు తమ సమీపంలోని స్వర్ణ గ్రామం లేదా స్వర్ణ వార్డు కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్ లేదా వార్డు డేటా ప్రాసెసింగ్ సెక్రటరీని సంప్రదించి, 'కౌశలం' నందు రిజిస్ట్రేషన్ చేసుకుని నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. వయస్సు 23 ఏళ్ల లోపు ఉన్న జిల్లా యువత ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.



# చారిత్రక సంపద ధ్వంసంపై ప్రజల ఆగ్రహం

### - పనులను అడ్డుకున్న మందసవాసులు

**మందస, జులై 5(వార్త):** మందసలోని వాసుదేవ ఆలయం పక్కన ఉన్న ప్రాచీన మండపాన్ని, దాని పరిసర ప్రాంతాలను ఇటీవల కాలంలో వరుసగా ధ్వంసం చేస్తుండటంపై స్థానిక ప్రజల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చారిత్రక కట్టడాల విధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ.. గత పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అధికారులకు రాతపూర్వకంగా వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పురాతన కట్టడాలను కాపాడుతామని గ్రీవెన్స్ అధికారులు ఇచ్చిన హామీ, ప్రస్తుతం కేవలం మాటలకే పరిమితమయ్యింది. ఆదివారం శిథిల మండపం నుండి జైన తీర్థంకరుడైన వృషభనాథుడి విగ్రహం వరకు ఉన్న పురాతన రాతి ప్లాట్‌ఫామ్‌ను జేసీబీ యంత్రంతో తవ్వడం ప్రారంభించారు. ఈ చారిత్రక కట్టడాలు ఒకవైపు ప్రాంతీయ సంస్కృతికి అద్దం పడుతుండగా, మరోవైపు ఈ మార్గం స్థానిక శివాలయానికి వెళ్లే ముఖ్య రహదారి కావడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న ప్రజలు, చరిత్ర ప్రేమికులు కలిసి జేసీబీ పనులను అక్కడికక్కడే నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ పాడీ మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలను తొలగిస్తూ ఆ స్థానంలో కడుతున్న నూతన కట్టడాలకు సంబంధించి కనీసం మ్యాపింగ్ లేకుండా చేయడం సరికాదని అన్నారు. ఎంపీటీసీ కంచి బెహరా మాట్లాడుతూ తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో చేస్తున్న ప్రాచీన కట్టడాల విధ్వంసాన్ని మాత్రమే ప్రశ్నిస్తున్నామన్నారు. ప్రాచీన కట్టడాలను తొలగించేటప్పుడు గ్రామస్తులను సంప్రదించాలని, అలా సంప్రదించకుండా ఏకపక్షంగా చేయడం వలనే మందస వారసత్వ సంపద ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యప్ప స్వామి కమిటీ మెంబర్ గయా సంతు మాట్లాడుతూ.. ఈ ప్రదేశం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి పరిరక్షించాలన్నారు. శివాలయం కమిటీ సభ్యుడు కురేష్ మాట్లాడుతూ శివాలయానికి వెళ్లే రహదారిని ఈ విధంగా ధ్వంసం చేసి వేర్వేరు నిర్మాణాలు చేపట్టడం వలన, మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంలో జరిగే కార్యక్రమాలలో పాల్గొనే భక్తులకు అసౌకర్యం కల్పించడమే కాకుండా తొక్కిసలాటలు వంటి ప్రమాదకర పరిస్థితులు దాపురిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి చెందిన పూర్ణచందు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను ఇక్కడ చేయకుండా, చారిత్రక ప్రదేశాల విధ్వంసం చేయడం సరికాదని అన్నారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణ కమిటీ కన్వీనర్ మామిడి కోదండరావు మాట్లాడుతూ ఉన్నతాధికారులు, పురాతత్వశాఖ స్పందించి ఈ తవ్వకాలను శాశ్వతంగా నిలిపివేయాలని, చారిత్రక కట్టడాల ధ్వంసానికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రాంతాన్ని రక్షిత కట్టడంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ చారిత్రక సంపద రక్షణ కోసం ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నిరంజన్ బెహరా, తిరుపతి బెహరా, బాడ సూరి, పద్మనాభం, గంగాదర బెహరా, సునీల్, కృష్ణ బెహరా, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.








## భేతాళపురంలో దాతల ఉదారత



**మందస, జులై 5(వార్త):** భేతాళపురంలో ఆ గ్రామ ప్రజలు సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుత కాలంలో అనుకోకుండా ఎవరైనా మరణిస్తే, వారి కుటుంబ సభ్యులు, బంధువులు దూర ప్రాంతాల నుంచి వచ్చి చివరిసారిగా వారి ముఖాన్ని చూసే అవకాశం కల్పించడం ఎంతో అవసరం. కానీ సరైన సదుపాయాలు లేకపోవడంతో మరణించిన వెంటనే అంత్యక్రియలు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యను గుర్తించిన బత్తిని పాపారావు మా గ్రామానికి డెడ్ బాడీ ఫ్రీజర్‌ను ఉచితంగా అందజేస్తానని ముందుకు వచ్చారు. ఆ ఫ్రీజర్‌ను భద్రంగా ఉంచేందుకు ప్రత్యేక గది అవసరం. దీంతో ప్రత్యేక గదిని నిర్మించాలని గ్రామంలోని మరికొందరు దాతలు కూడా ఆర్థిక సహాయం అందించారు. సుమారు రూ.లక్ష వరకు విరాళాలు సేకరించారు. గ్రామ కమిటీ, గ్రామ ప్రజలందరి ఆమోదంతో గ్రామానికి చెందిన భూమిలో స్థలం కేటాయించి ఆ గది నిర్మాణానికి ఆదివారం పునాది ముహూర్తం నిర్వహించారు. సేవా కార్యక్రమానికి సహకరిస్తున్న బత్తిని పాపారావు, ఆర్థికంగా తోడ్పడిన దాతలందరికీ, గ్రామ కమిటీ సభ్యులకు, భేతాళపురం గ్రామ ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కీలు తెల్లయ్య, ప్రధాన కార్యదర్శి మడియా రుషి, క్యాషియర్ గుంటు కామయ్య, కమిటీ సభ్యులు బత్తిని లక్ష్మణ్, జుత్తు అప్పలస్వామి, కీలు తవిటయ్య , బత్తిని దీనబందు, దున్న తిరుపతి, బత్తిని ఉమాపతి, కీలు మోహనరావు, లండ భానురావు, ఎంపల్లి జగ్గారావు, దున్న సాంబమూర్తి, దున్న హేమరాజు, బత్తిని తులసిరావు, కీలు వినోద్ పాల్గొన్నారు.

## లాలాపేటలో చోరీ కలకలం



**ఇచ్ఛాపురం, జులై 5 (వార్త):** లాలాపేటలో చోరీ కలకలం రేపింది. తట్ట కాళీ అనే మేస్త్రి ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ కి పాల్పడినట్లు పోలీసులు కి పిర్యాదు అందింది.అంగన్ వాడీ సెంటర్ పక్కన ఉన్న ఇంట్లో అందరూ ఉండగానే తాళాలు పగులగొట్టి బీరువా లో ఉన్న నగదు చోరీ కి గురైనట్లు పోలీసులు కి సమాచారం అందింది. టౌన్ ఎస్ ఐ ఎం.ముకుంద రావు క్లూస్ టీమ్ సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న వారిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే స్టేషన్ రోడ్డు లో ఓ ఇంట్లో పార్క్ చేసి ఉన్న బైక్ చోరీ కి గురైనట్లు సమాచారం.

## డివిజనల్ సర్వేయర్‌గా నాగేశ్వరరావు

**సోంపేట, జులై 5(వార్త) :** సోంపేట మండల సర్వేయర్ గా పనిచేస్తున్న ఎన్.నాగేశ్వరరావు కు పదోన్నతి లభించింది. ప్రస్తుతం టెక్కలి డివిజనల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ గా ఆయనకు అవకాశం లభించడంతో స్థానిక రెవెన్యూ వర్గాల్లో హర్షం వ్యక్తం అవుతుంది. అనేక సంవత్సరాలుగా సోంపేట,కంచిలి పలు మండలాల్లో మండల సర్వేయర్ గా పనిచేసిన నాగేశ్వరరావుకు ఎట్టకేలకు పదోన్నతి దక్కింది. ఆయన పనిచేసిన వివిధ మండలాల్లో ఎక్కడ ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సర్వే విషయాల్లో ఎంతో పగడ్బందీగా రైతు పక్షపాతిగా వేలాది మంది రైతులకు న్యాయం చేసిన నాగేశ్వరరావుకు పదోన్నతి లభించడం పట్ల అన్ని వర్గాల్లోనూ హర్షం వ్యక్తం అవుతుంది. ఈ మేరకు త్వరలో సోంపేట నుంచి రిలీవ్ కానున్నారు.



## సుత్తితో దాడి చేసి హత్యాయత్నం

### - నిందితుడి అరెస్టు

పలాస, **జులై 5(వార్త):** పలాస మండలంలో హత్యాయత్నం ఘటన కలకలం రేపింది. అక్రమ సంబంధం పెట్టుకున్నావంటూ ఆరోపిస్తూ ఓ వ్యక్తిపై సుత్తితో దాడి చేసిన ఘటనలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పలాస మండలం మొగిలిపాడు గ్రామానికి చెందిన 38 ఏళ్ల తోట హేమరాజు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ప్రభుత్వ పథకం కింద కోసంగిపురం గ్రామంలోని జగనన్న కాలనీలో ఆయనకు ఇంటి స్థలం కేటాయించడంతో అక్కడ ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ నెల 4వ తేదీ సాయంత్రం హేమరాజు తాను నిర్మిస్తున్న ఇంటి వద్దకు వెళ్లి, అక్కడి నుంచి జగనన్న కాలనీ ప్రధాన రహదారి గుండా కొండ వైపు నడుచుకుంటూ వెళుతుండగా, పక్కనే నివాసముంటున్న నెయ్యల రాజేష్ వెనుక నుంచి సుత్తి పట్టుకుని వచ్చాడు."మా అమ్మతో అక్రమ సంబంధం పెట్టుకుంటావా...నిన్ను చంపేస్తాను"అంటూ పెద్దగా కేకలు వేస్తూ హేమరాజు తలపై సుత్తితో బలంగా బాధడు. ఈ దాడిలో హేమరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనపై బాధితుడి తమ్ముడు తోట సురేష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన కాశీబుగ్గ పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్ని రామకృష్ణ ఆధ్వర్యంలో నిందితుడు నెయ్యల రాజేష్‌ను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.



## ఉపాధి కోసం వెళ్లి ప్రమాదానికి గురైన యువకుడు

### - అప్పుల ఊబిలో కుటుంబం
### -దాతల చేయూత కోసం ఎదురుచూపులు
### -ఆర్థిక సాయం అందించిన నౌపడ యూత్

**సంతబొమ్మాళి, జులై 5(వార్త):** కుటుంబాన్ని పోషించాలనే ఆశతో ఇతర రాష్ట్రానికి ఉపాధి కోసం వెళ్లిన ఓ పేద యువకుడికి ప్రమాదం రూపంలో విషాదం ఎదురైంది. వివరాల్లోకి వెళితే టెక్కలి మండలం నాయుడుపేట గ్రామానికి చెందిన నీలాపు నాని పని చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు ఎత్తు నుంచి కిందపడటంతో తలకు బలమైన దెబ్బ తగలడంతో పాటు, కాళ్ల ఎముకలు విరిగి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అతడిని ఒడిస్సా రాష్ట్రంలో కటక్ లో ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. యువకుడు నాని ప్రాణాలను కాపాడేందుకు తల్లిదండ్రులు తమకు చేతనైనంత వరకు తెలిసిన వారి వద్ద అప్పులు చేసి వైద్యం చేయించారు. అయినప్పటికీ ఇంకా చికిత్స కొనసాగాల్సి ఉండటంతో వైద్య ఖర్చులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రోజువారీ కూలీ పనులపై ఆధారపడే ఈ కుటుంబానికి సంపాదించే వ్యక్తి నాని మంచాన పడటంతో ఆ కుటుంబానికి జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారింది. ఒకవైపు అప్పుల భారం, మరోవైపు చికిత్స ఖర్చులు భరించలేక కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు స్పందించి ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. సమాజం నుంచి అందే చిన్న చేయూత కూడా ఆ యువకుడి చికిత్సకు, ఆ కుటుంబానికి గొప్ప అండగా నిలుస్తుందని గ్రామస్తులు కోరుతున్నారు. దాతలు సహాయం అందించాల్సిన ఫోన్ పే నెంబర్ 90148 31410, యూపీఐ ఐడి నెంబర్ 9014831410-2@ybl.



### నానికి నౌపడ యూత్ ఆర్థిక సాయం

సంతబొమ్మాళి మండలంలో నౌపడ గ్రామానికి చెందిన యూత్ నాని ప్రమాద పరిస్థితి తెలుసుకొని ఆర్థిక సహాయం అందించేందుకు గ్రామంలో సుమారుగా రూ.27 వేలను కలెక్షన్ చేసి ఆర్థిక సాయాన్ని అందించారు. ఇంకా దాతలు ముందుకు వచ్చి నానికి ఆర్థిక సాయం అందించి నాని కుటుంబానికి భరోసా కల్పించాలని నౌపడ యూత్ కోరారు.

## దామోదర సాగరం రిజర్వాయర్ పనుల పరిశీలన

### ప్రతీ చేనుకు నీరు-ప్రతీ చేతికి పని కల్పనే ధ్యేయం
### టీడీపీ మండల అధ్యక్షుడు దుర్యోధన

**మందస, జులై 5(వార్త):** ప్రతీ చేనుకు నీరు-ప్రతీ చేతికి పని కల్పనే ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అన్నారు. మందస మండలంలోని నర్సింగపురం పంచాయతీలో గల దేవుపురం గ్రామం సమీపంలోని దామోదర సాగరం ప్రాజెక్టు ఆధునికీకరణ, కాలువల పూడికతీత పనులను తెలుగుదేశం పార్టీ నాయకులు ఆదివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును, నాణ్యతా ప్రమాణాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యురాలు గౌతు శిరీష చొరవతో నియోజకవర్గ రైతాంగానికి ఎనలేని మేలు జరుగుతోందని కొనియాడారు. సాగరం పనుల నిమిత్తం సుమారు రూ.5కోట్ల భారీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మందస మండలం వ్యాప్తంగా ఉన్న సుమారు 32 కాలువల పూడికతీత పనుల కొరకు కోటి రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. మందస మండలంలో వ్యవసాయ, నీటిపారుదల రంగాన్ని బలోపేతం చేసేందుకు సుమారు రూ.8కోట్ల నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు మండల ప్రజలు, రైతాంగం తరపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతీ చేనుకి నీరు, ప్రతీ చేతికి పని అనే గొప్ప సంకల్పంతో ఎమ్మెల్యే శిరిషా ముందుకు సాగుతున్నారని, ఈ పనుల్లో ఎలాంటి దళారీల ప్రమేయం లేకుండా, రైతులు తామే స్వయంగా దగ్గరుండి పనులను చేయించుకోవడం విశేషమన్నారు. దీంతో నిధులు సద్వినియోగం అవ్వడమే కాకుండా పనుల్లో పూర్తి నాణ్యత ఉంటోందన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ బావన దుర్యోధనతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ముంజేటి చంద్రశేఖర్, బమ్మిడి కర్రయ్య, రట్టి లింగరాజు, గేదెల దుర్యోధన, రవీంద్ర గౌడ, చంద్రమౌళి, గెడ్డవలస భీమారావు, స్థానిక రైతులు ఉన్నారు. ఈ పనులు పూర్తయితే మందస మండలంలో సాగునీటి ఇబ్బందులు శాశ్వతంగా తొలగిపోతాయని, రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు.



## విద్యుత్ భద్రతా ప్రమాణాలు ముఖ్యం: ఎస్ఈ ప్రసాద్‌లి



**శ్రీకాకుళం, జులై 5(వార్త):** భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు, కాంట్రాక్టర్లు విధిగా విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని, అప్పుడే ప్రమాదాల బారిన పడకుండా ప్రాణరక్షణ పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) శ్రీకాకుళం ఆపరేషన్స్ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) జి.ఎన్.ప్రసాద్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని స్థానిక విద్యుత్ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికుల యూనియన్ నాయకులు, కాంట్రాక్టర్లు, మేస్త్రీలకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భద్రతా సూచనలు పాటించి, కుటుంబాల్లో ఆనందం నింపాలని కోరారు. భవన నిర్మాణ సమయంలో విద్యుత్ లైన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం నిర్మాణ సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను కార్మికులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేశ్ కుమార్, శ్రీకాకుళం ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.యోగేశ్వరరావు, విద్యుత్ శాఖ సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

## బాలకృష్ణాపురంలో పూడిక తీత పనులు



**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** బాలకృష్ణాపురం గ్రామ పంచాయతీలో కాలువ పూడిక తీత పనులు చేపట్టారు. క్లీనింగ్ శానిటేషన్ పనులు చేస్తున్న సిబ్బందికి సూచనలు చేశారు. మాజీ సర్పంచ్ ప్రతినిధి బోరుబాదులోహిదాసు , బి నూకయ్య, బి వాసయ్య, బి సంతోష్ ,ఎం నాగరాజు ఈ శానిటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఆదిత్యుడి ఆదాయం రూ.5.13లక్షలు

**శ్రీకాకుళం, జులై 5(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారికి టికెట్లు రూపేణా రూ.2,20,000లు, పూజలు, విరాళాల రూపంలో రూ.31,010లు, ప్రసాదాల రూపంలో రూ.1,25,215 లు, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు, ప్రసాదాల ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా రూ.1,37,580లు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

## ఆదిత్యుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి

**శ్రీకాకుళం, జులై 5(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దేవాలయంనకు విచ్చేసిన వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ , కార్యనిర్వహణాధికారి ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి ప్రసాదాలను, చిత్రపటం అందజేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# అనుమతులు లేకుండానే అక్రమ వెంచర్లు

- కోసంగిపురంలో కలకలం
- 15 అడుగుల వరద కాలువపై కన్నేసిన అక్రమార్కులు
- రైతుల సాగునీటికి ముప్పు..!
- ప్రభుత్వ భూమిని కలుపుకుంటూ ప్లాట్ల దందా
- కొండలను కొల్లగొట్టి టన్నుల కొద్దీ కంకర
- ఎవరి అండతో ఈ అక్రమాలు..?
- వర్షాకాలం ముంచుకొస్తుంటే వరద కాలువ పూడ్చివేత... ముంపు ప్రమాదంపై ఆందోళన
- టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖలు చూస్తూ ఊరుకున్నాయా..?
- ప్రజల్లో అనుమానాలు
- ప్రభుత్వ భూములు, రైతుల హక్కులతో చెలగాటం
- అధికారుల చర్యల కోసం ఎదురుచూపులు..!



**పలాస, జులై 5(వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కోసంగి పురంలో వెలుగుచూసిన అక్రమ వెంచర్ వ్యవహారం స్థానికంగా తీవ్ర చర్చనీ యాంశమైంది. ప్రభుత్వ శాఖల నుంచి అవసరమైన అనుమతులు లేకుండానే వెంచర్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువు ఆయకట్టు కింద వేలాది ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరు అందించే కీలకమైన 15 అడుగుల వెడల్పు వరద కాలువను ఆక్రమించి, దానిని పూడ్చేస్తూ ప్రభుత్వ భూమిని సైతం కలుపుకుని ప్లాట్లు రూపొందిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా ఈ వరద కాలువ ద్వారానే వర్షాకాలంలో దిగువ ప్రాంతాలకు నీరు చేరి వేలాది ఎకరాల పంటలకు సాగునీరు అందుతోందని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పుడు అదే కాలువ ఆనవాళ్లు లేకుండా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి దిగువ ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని, మరోవైపు రైతులకు సాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉందని చెబుతున్నారు. వెంచర్ పనుల కోసం సమీప కొండలను తవ్వి టన్నుల కొద్దీ కంకరను తరలిస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లడంతో పాటు పర్యావరణానికి కూడా హాని కలుగుతోందని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తూ, నిబంధనలను పక్కనపెట్టి నిర్మాణ పనులు జరుగుతున్నాయని విమర్శిస్తున్నారు. ఈ వ్యవహారంలో చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, మున్సిపల్ శాఖలు ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయని,అనుమతులు లేకుండా పనులు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో అధికారుల పర్యవేక్షణపై కూడా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

ఈ వ్యవహారంపై టౌన్ ప్లానింగ్ అధికారి హర్షను వివరణ కోరగా కోసంగిపురంలోని సంబంధిత లేఅవుట్‌కు ఎలాంటి అనుమతి లేదని తెలిపారు. అనుమతి లేకుండా లేఅవుట్ వేసిన నిర్వాహకులకు నోటీసులు జారీ చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న అక్రమ లేఅవుట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుని వాటిని తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పుడు అందరి దృష్టి జిల్లా యంత్రాంగంపైనే ఉంది. రైతుల సాగునీటికి జీవనాడిగా ఉన్న వరద కాలువను పరిరక్షిస్తారా..? ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతారా..? అనుమతులు లేకుండా వెంచర్ ఏర్పాటు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారా..? అన్న ప్రశ్నలకు అధికారులు ఎలాంటి సమాధానం ఇస్తారో వేచి చూడాల్సి ఉంది.



## ఓటర్ల సవరణ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలి

- అదనపు సీఈఓ వెంకటేశ్వర్లు



**శ్రీకాకుళం, జులై 5(వార్త):** జిల్లాలోని జలుమూరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో శనివారం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు ఆకస్మికంగా తనిఖీ చేసి, క్షేత్రస్థాయి పరిశీలన అత్యంత పారదర్శకంగా, పక్కాగా జరగాలని అధికారులను ఆదేశించారు. నరసన్నపేట నియోజకవర్గం జలుమూరు మండలం శ్రీముఖలింగం, ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం కొండములగాం గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 135, 136తో పాటు, ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం గ్రామంలోని పోలింగ్ కేంద్రం 254లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను రాండమ్‌గా పరిశీలించిన ఆయన, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమాల్లో నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, వంశధార ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ జయదేవి, జలుమూరు తహసీల్దార్ తదితర రెవెన్యూ, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. క్షేత్రస్థాయిలో అందుతున్న దరఖాస్తుల పరిష్కారంలో ఎక్కడా రాజీ పడకూడదని, గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని అదనపు సీఈఓ అధికారులకు పిలుపునిచ్చారు. తనిఖీల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల వారీగా నమోదైన వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

## జడ్పీలో నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక

-కలెక్టర్ స్వప్నిల్ దినకర్

**శ్రీకాకుళం, జులై 5(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక శ్రీకాకుళంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి అర్జీలు నేరుగా పై కార్యక్రమంలో లేదా ఆన్లైన్‌లో Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో అర్జీలు నమోదు చేసుకోవచ్చునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్ పాత సమావేశ మందిరంలో రెవెన్యూ క్లినిక్ ఉంటుందని, ప్రజలు గమనించి రెవెన్యూ క్లినిక్ ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో)కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు. అర్జీదారులు గమనించి నేడు నిర్వహించే ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రైతన్నను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కూన రవికుమార్



**పొందూరు, జులై 5(వార్త):** కింతలి గ్రామంలో ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆముదాలవలస గౌరవ శాసనసభ్యులు, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ కాలంలో రెవెన్యూ వ్యవస్థలో ఎన్నో తప్పులు జరిగాని రైతుల పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మలు వేయడం రైతులు అభద్రత భావానికి లోనయ్యారని అందుకే కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణమే తప్పులు సరిదిద్దామని ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రైతుల పేరు తయారుచేసి ఇవ్వడం జరుగుతుందని, రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. రైతుల భూములకు శాశ్వత గుర్తింపు కల్పించడంతో పాటు భూ యాజమాన్య హక్కులకు మరింత భద్రత కల్పించేందుకు ప్రభుత్వం ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తోందన్నారు. ఈ పాస్ పుస్తకాలు రైతులకు చట్టపరంగా మరింత బలాన్ని ఇవ్వడమే కాకుండా భూములకు సంబంధించిన అన్ని ప్రభుత్వ సేవలను సులభంగా పొందేందుకు ఉపయోగపడతాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రెవెన్యూ వ్యవస్థను మరింత పారదర్శకంగా, ప్రజలకు చేరువ చేసేలా చర్యలు తీసుకుంటోందన్నారు. భూముల రికార్డుల నిర్వహణలో సాంకేతికతను వినియోగిస్తూ రైతులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రైతుల భూములకు సంబంధించిన వివాదాల పరిష్కారం, రికార్డుల నవీకరణ, వారసత్వ మార్పులు, ఇతర రెవెన్యూ సేవలను సకాలంలో అందించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. రైతులకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సేవ గ్రామస్థాయిలోనే అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిగురుపల్లి రామ్మోహన్, టిడిపి సెక్రెటరీ సీపాన శ్రీ రంగనాయకులు, మాజీ ఏఎంసీ చైర్మన్ అన్నేపు రాము, బాడన శేషగిరి, చిన్న రంగా, బలగ శంకర్ భాస్కర్, బీసీ అధ్యక్షులు చింతాడ వాసు, ఎంపిటిసి హనుమంతరావు, కూటమి ముఖ్య నాయకులు ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామ పెద్దలు, రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పంజాబ్‌లో సెప్టెంబర్ 20,21 తేదీలలో ఏఐకేఎం కిసాన్ జాతీయ మహాసభలు

- జాతీయ కార్యధర్శి డి.హరనాథ్



**పలాస, జులై 5(వార్త):** అఖిలభారత కిసాన్ మహాసభలు పంజాబ్‌లోని జలంధర్‌లో సెప్టెంబర్ 20, 21 తేదీలలో జరగనున్నాయని అఖిల భారత కిసాన్ మహాసభ జాతీయ కార్యదర్శి డి హరినాథ్ రాజస్థాన్లోని ఝుంఝునూలో జరిగిన జా తీ య ౦ న వ మా వే శ ౦ లో నిర్ణయించారని తెలియజేశారు. ఈ మహాసభలు విజయవంతం చేయటానికి కార్యకర్తలు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా ఇండియా వాణిజ్య ఒప్పందం ద్వారా భారత రైతు తీవ్రంగా నష్టపోతున్నారని, దీన్నిపూర్తిగారద్దుచేయాలని హరినాథ్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో బలవంత భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టనునట్టు తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబు పాలన లో వేలాది ఎకరాలు కార్పొరేట్ లకుకట్టబెట్టే విధానానికి వ్యతిరేకంగా అన్ని రైతు సంఘాలతో ఐక్య ఆందోళన చేపడతామని హరినాథ్ తెలిపారు. రాష్ట్రంలోని 30 లక్షల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని హరినాథ్ ఆరోపించారు. కనీసం యూరియా కూడా రాష్ట్ర ప్రభుత్వం అందించలేక వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఇటీవల యూరియా సరఫరాపైతెచ్చిన జీవో రద్దు చేయాలని ఒకేసారి రైతుకు యూరియా సరఫరా చేయాలని హరినాథ్ డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం జ2౦50 గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్లకు 16లక్ష ల కోట్ల రుణాలను రద్దు చేసే ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉన్న రైతాంగానికి రుణ మాఫీ చేయాలని హరినాథ్ డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పైబడిన రైతుకు నెలకు పదివేల పెన్షన్ ఇవ్వాలని, సాగునీటి ప్రాజెక్టులన్నీ సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అటవీ భూములు సైతం ఆదానీ అంబానీలకు కట్టబెట్టే విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన చేపడుతామని హరినాథ్ హెచ్చరించారు. వ్యవసాయాన్ని! భూమిని! రైతుని! కాపాడుకుందాం! అని హరినాథ్ పిలుపునిచ్చారు.

# పోలాకి మండలంలో రూ.7.5 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- ఏడు పంచాయతీల్లో మౌలిక వసతుల పనులను ప్రారంభించిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్
- ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి



**పోలాకి, జూలై 5 (వార్త):** పోలాకి మండలంలో రూ.7.5 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం ఘనంగా శ్రీకారం చుట్టారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన సంయుక్తంగా అభివృద్ధి పనులను ప్రారంభించారు. రాళ్లపాడు, ప్రియాగ్రహారం, రహిమాన్‌పురం, గుప్పిడిపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, ఉరజాం పంచాయతీల పరిధిలో మంజూరైన రహదారులు, మౌలిక వసతులు తదితర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామానికి నాణ్యమైన రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలాకి మండలంలో ఇంకా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను కూడా దశలవారీగా పూర్తి చేసి ప్రజల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ, గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రూ.7.5 కోట్లతో చేపట్టిన ఈ అభివృద్ధి పనులు మండల ప్రగతికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రహదారుల సమస్యలకు పరిష్కారం లభించనుండటంతో సంబంధిత ఏడు పంచాయతీల ప్రజలు, రైతులు, స్థానిక నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రి, ఎమ్మెల్యేలకు గ్రామాల వారీగా ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


## వృద్ధులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు

-45 మందికి పరీక్షలుస

-24 మందికి శస్త్రచికిత్సకు ఎంపిక

- జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శిబిరం

**సారవకోట, జులై 5(వార్త):** సారవకోట మండలం అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం వృద్ధుల కోసం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి వృద్ధులు విశేషంగా హాజరై సేవలను వినియోగించుకున్నారు. శిబిరంలో వైద్య నిపుణులు మొత్తం 45 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, దృష్టి సమస్యలను పరిశీలించారు. పరీక్షల అనంతరం 24 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి చికిత్స కోసం ఎంపిక చేసినట్లు శిబిర నిర్వాహకులు ఆనందరావు తెలిపారు. వృద్ధులు కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా నిరంతర వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచించారు. కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స పొందడం ద్వారా దృష్టిని కాపాడుకోవచ్చని అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు. శిబిరం నిర్వహించిన జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధులు, వైద్య బృందాన్ని వారు అభినందించారు.




## కోర్కెలు తీర్చే కల్పవల్లి కాటమ్మ తల్లి

అంగరంగ వైభవంగా పలాస ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అమ్మవారి మహోత్సవాలు

భక్తి పారవశ్యంలో ఘటాన్ని మోసిన ఎమ్మెల్యే శిరీష

ప్రత్యేక పూజలతో అమ్మవారి ఆశీస్సులు

**పలాస, జులై 5 (వార్త):** కాటమ్మ తల్లి నామస్మరణతో పలాస పట్టణం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. పలాస-కాశీబుగ్గ పట్టణంలోని పలాస ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కాటమ్మ తల్లి అమ్మవారి వార్షిక మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా కొనసాగాయి. తెల్లవారుజాము నుంచే ఆలయానికి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మహిళల బోనాలు, ఘటాల ఊరేగింపు, మంగళ వాయిద్యాలు, భక్తి గీతాలు, జై కాటమ్మ తల్లి నినాదాలతో పలాస పట్టణం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. ఈ మహోత్సవాల్లో పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారి పవిత్ర ఘటాన్ని తలపై ధరించి భక్తి భావంతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం శ్రీ కాటమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. ఎమ్మెల్యే ఘటాన్ని మోసిన దృశ్యాలను చూసిన భక్తులు హర్షధ్వానాలతో స్వాగతం పలుకుతూ అమ్మవారికి జైజైధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ పలాస ప్రజలకు శ్రీ కాటమ్మ తల్లి ఇలవేల్పు దేవతగా అపారమైన విశ్వాసం ఉందని, అమ్మవారి కృపతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఇటువంటి ఉత్సవాలు భక్తి, సంప్రదాయాలు, సామాజిక ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. ఉత్సవాల్లో ఆటో యూనియన్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, మహిళలు, యువత, చిన్నారులు, వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. భక్తులకు ప్రసాదం, తాగునీరు తదితర సౌకర్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేయగా, పోలీసులు పటిష్ఠ బందోబస్తుతో ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు. శ్రీ కాటమ్మ తల్లి కృపతో పలాసలో భక్తి వెల్లువ పారగా... ఘటాన్ని మోసి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీష భక్తుల ప్రశంసలు అందుకున్నారు. అమ్మవారి మహిమతో పలాస ఆధ్యాత్మిక వైభవానికి నిలయంగా మారింది."



## శ్రీకాకుళం

# మాజీ స్పీకర్ తమ్మినేనిపై వ్యాఖ్యలు సరికాదు



**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** నలభై ఏళ్లకు పైగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కలిగి, స్పీకర్‌గా శాసనసభ గౌరవాన్ని పెంచిన ఉత్తరాంధ్ర సీనియర్ బీసీ నాయకుడు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం పై టీడీపీ సోషల్ మీడియా వేదికగా చేస్తున్న వ్యక్తిత్వ హననాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక వెనుకబడిన వర్గాల అగ్రనేతపై ఇంతటి అనాగరిక దాడి దారుణమని వైస్సార్ సి పి నాయకులు సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి అన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి రూరల్ ప్రాంతాల్లోని పేద ప్రజల కష్టాలను, వారి కన్నీళ్లను కళ్లారా చూసి చలించిపోయిన ఒక పితృ సమానమైన నాయకుడి భావోద్వేగాన్ని 'నటన' అంటూ వెక్కిరించడం తెలుగుదేశం పార్టీ దిగజారుడుతనానికి పరాకాష్ట అని అన్నారు. రాజకీయాలంటే కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయడం మాత్రమే అనుకునే పచ్చ నాయకులకు ప్రజల కష్టాలు చూసి కన్నీరు పెట్టే నాయకుడి విలువ ఏం తెలుస్తుందని, తమ్మినేని సీతారాం ఎప్పుడూ క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య తిరిగే మట్టి మనిషి. గ్రామీణ ప్రాంతాలలో పేదలు పడుతున్న ఇబ్బందులు చూసి, వారి గుండె చప్పుడు విన్న సీనియర్ నాయకుడు కాబట్టి వారి కష్టాలు చలించి కళ్లు చెమరిస్తే, దాన్ని 'ఏడుపు నటన' అని సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తారా? గుండెల్లో జాలి, కరుణ, మానవత్వం లేని నరాధములకు మాత్రమే నిజాయితీతో కూడిన ఆవేదన మీకు నటనలా కనిపిస్తుంద అని ప్రశ్నించారు. పేదవాడి కన్నీళ్లకు చలించే గుణాన్ని అవహేళన చేయడం అంటే... ఈ రాష్ట్రంలోని కోట్లాది మంది పేద ప్రజలను, శ్రామికులను అవమానించడమేఅని అన్నారు. మూడు రాజధానులు ఎక్కడ? అభివృద్ధి వికేంద్రీకరణ ఏమైపోయింది?" అని ప్రశ్నిస్తున్న టీడీపీ అజ్ఞానులకు మేము సూటిగా సమాధానం చెప్తున్నాం అని,నూటికి నూరుపాళ్లు ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకున్నది ఎల్లో ముఠానే అని, ఉత్తరాంధ్ర వెనుకబడిపోకూడదని, వైజాగ్ పరిపాలనా రాజధాని కావాలని నాడు ఆకాంక్షిస్తే.. దాన్ని కోర్టు స్టేలతో, దొంగ పాదయాత్రలతో, కుట్రలతో అడ్డుకుంది మీ అమరావతి రియల్ ఎస్టేట్ ముఠా కాదా అని ప్రశ్నించారు. విశాఖపట్నం రాజధానిగా వస్తే ఇక్కడి గ్రామీణ ప్రాంతాలు, ఉత్తరాంధ్ర యువతకు ఐటీ ఉద్యోగాలు, ఉపాధి దొరుకుతుందని నాడు జగనన్న ప్రభుత్వం పోరాడింది. కానీ నేడు మీరు బీచుల్లో బార్లు పెట్టి, మందు దుకాణాలతో విశాఖ సంస్కృతిని నాశనం చేస్తున్నారని అన్నారు.- నాడు వైజాగ్ ను గ్లోబల్ సిటీగా మార్చి ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయడానికి పూనుకుంటే.. నేడు కూటమి ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వడం చేతకాక, బీచుల్లో బార్లు పెట్టి ఇక్కడి భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారని. నాడు అడుగడుగునా అభివృద్ధిని అడ్డుకుని, ఈ రోజు మళ్లీ ఏ మొహం పెట్టుకుని వికేంద్రీకరణ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. అమరావతిలో కేవలం 29 గ్రామాల్లో ఒకే ఒక్క సామాజిక వర్గానికి చెందిన భూముల రేట్లు పెంచడం కోసం, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల అభివృద్ధిని తాకట్టు పెట్టిన మీకు వికేంద్రీకరణ గురించి మాట్లాడే అర్హత లేదని, నాడు విశాఖలో అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు పెట్టి, అదానీ డేటా సెంటర్, ఇన్ఫోసిస్ లాంటి దిగ్గజ సంస్థలను తీసుకువస్తే కూటమి ప్రభుత్వం కొత్త కంపెనీలు తేవడం చేత కాక తీరమంతా మందు షాపులు పెట్టి విశాఖ సంస్కృతిని భ్రష్టు పట్టిస్తోందని అన్నారు.- ఉత్తరాంధ్ర దశాబ్దాల వెనుకబాటుతనాన్ని పోగొట్టడానికి, వైజాగ్‌ను పరిపాలనా రాజధానిగా ప్రకటించి, భోగాపురం ఎయిర్‌పోర్ట్, మూలపేట పోర్టుల ద్వారా ఈ ప్రాంత రూపురేఖలు మార్చాలని చూసింది జగనన్న ప్రభుత్వం.అని కానీ ఉత్తరాంధ్రకు దక్కాల్సిన రాజధాని హోదాను కుట్రలతో కాలరాసింది కూటమి ప్రభుత్వం అని అన్నారు- నాడు జగన్న ప్రభుత్వం విశాఖ ను అంతర్జాతీయ స్థాయిలో నిలిపితే కూటమి అధికారంలోకి రాగానే గంజాయి, డ్రగ్స్, భూకబ్జాలు, దాడులతో వైజాగ్ ప్రశాంతతను అడుగడుగునా నాశనం చేస్తూ ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని వికేంద్రీకరణ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. బ్రాండ్ వైజాగ్ ను... బ్రాందీ వైజాగ్ గా మార్చేశారని ఆరోపించారు. నాడు మూడు రాజధానుల ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలనూ సమానంగా అభివృద్ధి చేయాలని జగనన్న చూస్తే కోర్టుల్లో స్టేలు తెచ్చి, చంద్రబాబు బినామీల రియల్ ఎస్టేట్ కోసం అడుగడుగునా అడ్డుపడింది టీడీపీ కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్ర రాజధాని వ్యవహారాన్ని స్వార్థం కోసం కోర్టుల చుట్టూ తిప్పి స్తంభింపజేస్తే, ప్రజల శ్రేయస్సు కోసం జగనన్న తెచ్చిన సరికొత్త, ఆచరణాత్మకమైన మార్గమే ఈ 'మావిగన్' మెగా సిటీ అన్నారు. అమరావతి పేరుతో లక్షల కోట్లు తగలేస్తున్న టీడీపీకి.. కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని అన్ని వర్గాల ప్రజలకు, యువతకు ఉపాధి కల్పించే 'మావిగన్' మెగా సిటీ ప్రాజెక్ట్ చూసి ఓర్వలేక ఏడవాలో, నవ్వాలో తెలియక వెటకారాలు చేస్తున్నారని. నాడు 3 రాజధానులు అంటే అడ్డుపడ్డారునేడు 3 అతిపెద్ద నగరాలను కలిపి రాజధాని చేస్తాం అంటే ఎందుకు వణికిపోతున్నారని అన్నారు.ఎన్నికల ఎజెండా గురించి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని, తమ్మినేని ని ప్రశ్నించే ముందు తెలుగుదేశం ప్రభుత్వం తమ ఐదేళ్ల ముసుగును తొలగించుకోవాలని. తమ ఎజెండా ఎప్పుడూ స్పష్టం అని అది నవరత్నాలు పేదల సంక్షేమమే. కానీ, 'సూపర్ సిక్స్' అంటూ లేనిపోని అబద్ధపు హామీలు ఇచ్చి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి ఆడపిల్లకి నెలకు 1500 రూపాయలు అని ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని... అధికారంలోకి రాగానే 'బడ్జెట్ లేదు, ఖజానా ఖాళీ' అంటూ చేతులెత్తేసిన దగాకోరు ప్రభుత్వానికి కనీసమైనా సిగ్గుందా?ప్రజలను నట్టేట ముంచిన కూటమి నేతలు రాజకీయాల నుండి తప్పుకోవాలా... లేక నిరంతరం ప్రజల పక్షాన నిలబడే తమ్మినేని సీతారాం తప్పుకోవాలా? అని ప్రశ్నించారు. ఒక సీనియర్ బీసీ నేతను, ఉత్తరాంధ్ర గొంతుకను టార్గెట్ చేసి ఆనందం పొందాలని చూస్తే ఉత్తరాంధ్ర సమాజం చూస్తూ ఊరుకోదు. ప్రజల కష్టాలను చూసి చలించిన ఆ కన్నీటి బొట్టు... రాబోయే రోజుల్లో మీ కూటమి ప్రభుత్వ అహంకారాన్ని ముంచేసే సునామీగా మారుతుందని హెచ్చరిస్తున్నామని, తమ్మినేని పై చేసిన ఈ నీచమైన ట్రోల్స్‌కు కూటమి నాయకులు, వారి సోషల్ మీడియా ముఠా తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ నియోజకవర్గం సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి తో పాటు ఇచ్ఛాపురం నియోజకవర్గ యువజన అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు ఆసి క్రిష్ణా రెడ్డి,యస్ సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సల్లా దేవరాజు, ఆసి పురుషోత్తం రెడ్డి,కారింగి త్రినాథ్ రెడ్డి, బార్ల నాగభూశనం, నీలాపు జగదీష్ రెడ్డి, వడ్డిన తేజా రెడ్డి, సప్ప వంశీ యాదవ్,అనపాన శ్రీరామ్ రెడ్డి, సాడి జయరామ్ రెడ్డి, పానపా రాజారావు తదితరులు పాల్గొన్నారు.వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ మారో ప్రకటన లో ఇదే విషయాన్ని ఖండించారు.

## సర్‌పై ప్రజలకు అవగాహన



**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** కొఠారి పంచాయతీ పరిధిలోని పూర్ణాటకం గ్రామాన్ని సందర్శించి, ఎస్ ఐ అర్ కార్యక్రమంపై ఎంపీడీవో ప్రభాకర్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం బీఎల్ఓతో కార్యక్రమం పురోగతిని సమీక్షించిన ఆయన, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్ ప్రక్రియను నాణ్యతతో, పారదర్శకంగా పూర్తి చేయాలని బీఎల్ఓకు సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓ సంతోష్‌తో పాటు బీఎల్ఏలు పాల్గొన్నారు.

## బోరుకు మరమ్మత్తులు



**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** కేశుపురం గ్రామంలో గల పాండురంగ స్వామి దేవాలయం ఆవరణలో ఉన్న బోరు మరమ్మత్తులకు గురికావడంతో గ్రామస్థులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పంచాయతీ టీడీపీ కార్యకర్త, ప్రధాన కార్యదర్శి గుజ్జు.భీమరాజు రెడ్డి చొరవ తీసుకుని బోరుకు మరమ్మత్తులు చేపట్టించారు. దీంతో గ్రామస్థులకు తాగునీటి సౌకర్యం పునరుద్ధరించబడింది. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొని సహకరించారు.

# చివరి దశకు కేజీబీవీ వసతిగృహ నిర్మాణం

- రూ.1.24 కోట్లతో ఆధునిక భవనం

- 10న ప్రారంభానికి అధికారుల సన్నాహాలు

**సారవకోట, జులై 5(వార్త):** సారవకోటలో నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) వసతి గృహ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ప్రభుత్వం సర్వ సమగ్ర శిక్ష అభియాన్ నిధులతో రూ.1.24 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భవన నిర్మాణం దాదాపు పూర్తికావడంతో ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థినుల వసతి, విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మిస్తున్న ఈ భవనంలో ఆరు విశాలమైన తరగతి గదులతో పాటు ఆధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. మిగిలిన స్వల్ప పనులను పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయితే కేజీబీవీ విద్యార్థినులకు మెరుగైన వసతి, విద్యా వాతావరణం అందుబాటులోకి రానుంది. దీంతో విద్యార్థినులు మరింత సౌకర్యవంతమైన పరిస్థితుల్లో విద్యాభ్యాసం కొనసాగించే అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. నిర్మాణ పనులు పూర్తికావడంతో ఈ నెల 10వ తేదీన భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. విద్యార్థినులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా వేగంగా జరుగుతున్నాయి.



## పూర్వ విద్యార్థుల ఆర్థిక సహాయం



**ఇచ్ఛాపురం, జులై 5(వార్త):** ఈదుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలసి చదువుకున్న తమతోటి బాల్యమిత్రుల కుటుంబాలు ఇబ్బందులను తెలుసుకొని వారికి 84 వేల రూపాయలు ఆర్థిక సహాయం చేసారు. సీమూరు, మొదలుకొని ఈదుపురం వరకు గల ఐదు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో నర్తు ప్రేమ్ కుమార్ యాదవ్, ఉప్పాడ జ్యోతి సాయికుమార్,దక్కత జయరామ్ రెడ్డి, యర్ర జోగారావు, తెలుకల సుభాష్, టి ధర్మరాజు, డి. కమలకుమారి, యూ లీలారాణి ఈ.లక్ష్మి కాంతం, యస్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

- ఏపీయూడబ్ల్యూజే నాయకులు

**శ్రీకాకుళం, జులై 5(వార్త):** శ్రీకాకుళం రెవెన్యూ గెస్ట్ హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి జర్నలిస్టులు, సంఘం నాయకులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు సుబ్బారావు మాట్లాడుతూ, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అక్రిడిటేషన్ కార్డుల జారీ, ఆరోగ్య బీమా, గృహ స్థలాలు, సంక్షేమ పథకాల అమలు, ప్రమాద బీమా, పెన్షన్ వంటి అంశాలపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి భద్రత, సంక్షేమం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు, సీనియర్ జర్నలిస్టులు తమ అభిప్రాయాలను వెల్లడించి, జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు సుబ్బారావు, సామ్నా రాష్ట్ర అధ్యక్షుడు నల్లి ధర్మారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్, సనపల రమేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్ష, కార్యదర్శులు పైడి బాలకృష్ణ, మొదవలస రమేష్, విశాలాంధ్ర విశాఖ ప్రాంతీయ మేనేజర్ సనపల నరసింహులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు.. మహరణ, బెండి నరసింగరావు, సామ్నా జిల్లా అధ్యక్షులు సున్నపు చిన్నారావు, ఆంధ్రప్రభ మేనేజర్ అండ్ స్టాఫ్ రిపోర్టర్ చంద్రశేఖర్ ముని శ్రీనివాస్, పలాస, ఇచ్ఛాపురం, టెక్కలి, నరసన్నపేట, శ్రీకాకుళం, ఆమదాలవలస, పాతపట్నం, ఎచ్చెర్ల, రణస్థలం నుంచి అధిక సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.



## సూక్ష్మ విండ్ పవర్ జనరేటర్‌తో యువ ఇంజినీర్‌కు అంతర్జాతీయ గుర్తింపు

- ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న నరసన్నపేట యువకుడు

- త్వరలో వరల్డ్ రికార్డు అవార్డు అందుకోనున్న మహేశ్వరం భానుచందర్

**నరసన్నపేట, జులై 5(వార్త):** నరసన్నపేట పట్టణానికి చెందిన యువ ఇంజినీర్ మహేశ్వరం భానుచందర్ తన వినూత్న ఆవిష్కరణతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. కేవలం 5 సెంటీమీటర్ల ఎత్తులో సూక్ష్మ విండ్ పవర్ జనరేటర్‌ను రూపొందించి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న భానుచందర్, సాంకేతిక రంగంపై ఆసక్తితో ఈ వినూత్న నమూనాను రూపొందించారు. చిన్న పరిమాణంలో రూపొందించిన ఈ విండ్ పవర్ జనరేటర్ ఆయన ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. ఈ ఆవిష్కరణకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన పేరు నమోదు కావడం విశేషం. త్వరలోనే వరల్డ్ రికార్డు అవార్డును కూడా అందుకోనున్నట్లు సమాచారం. మహేశ్వరం భానుచందర్ సాధించిన ఈ ఘనత నరసన్నపేట ప్రాంతానికి గర్వకారణంగా నిలిచిందని స్థానికులు, విద్యావేత్తలు, మిత్రులు అభినందనలు తెలియజేస్తున్నారు. యువత తమ ప్రతిభను వినూత్న ఆవిష్కరణల ద్వారా ప్రపంచానికి చాటిచెప్పాలని ఆకాంక్షిస్తున్నారు.



# ఎన్నికల వాగ్దానాలు అమలు చేయకపోతే ఉద్యమం

**మందస, జులై 5(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల అమలు చేయకపోతే ఉద్యమం తప్పదని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ గణపతి హెచ్చరించారు. మందసలో జరిగిన కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి, ఇచ్ఛాపురం వరకు నీరు ఇస్తామని,జీడిగి గిట్టుబాటు ధర కల్పించి, జీడి బోర్డు ఏర్పాటు చేస్తామని, జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని, వంశధార నిర్వాసితులకు ప్రత్యేక ప్యాకేజీ అమలు చేస్తామని,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ఏర్పాటు చేసి సుందర శ్రీకాకుళం నిర్మిస్తామని,కోడి రామమూర్తి స్టేడియం పూర్తి చేస్తామని రిమ్స్ ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ గా ప్రమోట్ చేస్తామని, ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తుందని విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేదు ప్రజలకు సమాధానం చెప్పాలని కేంద్ర పౌర విమానయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని ప్రశ్నించారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి చివర భూములు ఇచ్ఛాపురం వరకు నీరిస్తే జిల్లా సస్యశ్యామలమవుతుందని తద్వారా జిల్లా అభివృద్ధి అవుతుందని అన్నారు పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు ఎందుకు కేటాయించడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో ఐటీడీఏ లేకపోవడం వలన గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకి నీరు ఎత్తినట్లు చూస్తుందని విమర్శించారు. జీడీకి గిట్టుబాటు ధర లేకపోవడం వల్ల జీడి రైతులు తీవ్రమైన దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు వాగ్దానాలు అమలు చేయకుండా జిల్లాను విధ్వంసానికి పూనుకుంటున్నారని విమర్శించారు. సముద్ర తీర ప్రాంతాన్ని ఆదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు



కట్టబెట్టి తీర ప్రాంతం విధ్వంసానికి పూనుకుంటుందని విమర్శించారు. ఉద్దానాన్ని విధ్వంసం చేసే కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 50 లక్షల మంది షెడ్యూల్ ఎంప్లాయిమెంట్ కార్మికులు ఉన్నారని వీరికి కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడం వలన కార్మికులను యాజమాన్యాలు తీవ్రమైన దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో బిజెపి కూటమి ప్రభుత్వం లేబర్ కోడ్లు తెచ్చి కార్మిక వర్గానికి మోసం చేసిందని విమర్శించారు.జీడి, రైస్ మిల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకపోవడం వల్ల దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి రైస్ మిల్ కార్మికులకు కనీస వేతనాలు,పిఎఫ్, ఈఎస్ఐ, ఎనిమిది గంటల పని దినము అదనపు పనికి అదనపు వేతనము ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే కేశవరావు సిఐటియు నాయకులు యన్ లచ్చయ్య, బి పోలయ్య, బి దుర్యోధన, పి కుర్మారావు, ఆర్ ఏకాశి, బి మల్లేసు, పి డోంబురు, కె చిన్న తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546